హామీలు ఏమాయే..!

- రాజాంలో అర్ధంతరంగా నిలిచిన టిడ్కో ఇళ్ల నిర్మాణం
- నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన టీడీపీ కూటమి
- టిడ్కో ఇళ్లకు, జగనన్న కాలనీకి 30 అడుగుల వెడల్పుతో బీటీ రోడ్డు వేస్తామని మరో హామీ
- కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఫలితం శూన్యం



రాజాం టిడ్కో కాలనీలో అర్ధంతరంగా నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

రాజాం: ఈ ఫొటోలో కనిపిస్తున్న భవనాలు రాజాం పట్టణ పరిధి కంచరాం గ్రామ సమీపంలోని టిడ్కో ఇళ్లు. 2014–19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం వీటి నిర్మాణం ప్రారంభించింది. అయితే వీటిలో ప్లాట్లను నిజమైన అర్హులకు కాకుండా ఎక్కువగా ఉద్యోగులకు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. మొత్తం 1,400 వరకు ప్లాట్ల నిర్మాణానికి అప్పట్లో పనులు ప్రారంభమయ్యాయి. పలువురు లబ్ధిదారుల నుంచి వారి వాటా కింద కొంత మొత్తం నగదును ప్రభుత్వం సేకరించింది. లబ్ధిదారులు చెల్లించాల్సిన మిగతా మొత్తాన్ని రాజాంలోని బ్యాంకుల వద్ద నుంచి వారి పేరిట రుణాలుగా ప్రభుత్వం తీసుకుంది. అయితే టీడీపీ అధికారంలో ఉన్నంత కాలం ఈ నిర్మాణాలను



తారురోడ్డు హామీకే పరిమితమైన టిడ్కో కాలనీకి వెళ్లే గ్రావెల్ రోడ్డు

పూర్తి చేయకుండా, ప్లాట్లను లబ్ధిదారులకు కేటాయించకుండా కాలయాపన చేసింది. బ్యాంకు రుణాలు చెల్లించ లేక, ప్లాట్లు లేక కొంతమంది లబ్ధిదారులు రాజాం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగారు. టీడీపీ పెద్దల వద్దకూ వెళ్లారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తుంది..ఈ ప్లాట్ల నిర్మాణాలు పూర్తి చేసి అందిస్తామని హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబునాయుడు సైతం వీటి ప్రస్తావన తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తామన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇంతవరకు వీటి నిర్మాణాలను పూర్తి చేయలేదు. ఒక్క లబ్ధిదారుడి కూడా ఇల్లు అందించలేదు.

హామీలే మిగిలాయి..

టిడ్కో కాలనీ నిర్మాణం చేపడుతున్న ప్రాంతానికి సమీపంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేసి, ఇందులో 1,200 మంది నిజమైన పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల ర్మాణానికి బిల్లులు మంజూరు చేశారు. టిడ్కో కాలనీతో పాటు జగనన్నకాలనీకి గత ప్రభుత్వం 30 అడుగుల వెడల్పుతో గ్రావెల్ రోడ్డు నిర్మించింది. ఈ రోడ్డునే తారురోడ్డుగా అభివృద్ధి చేస్తామని టీడీపీ కూటమి నేతలు ఎన్నికల ముందు హామీలు ఇచ్చారు. రెండు కిలోమీటర్ల మేర చేపట్టాల్సిన తారురోడ్డు నిర్మాణం కూడా ఇంతవరకు జరగలేదు. అటు టిడ్కో కాలనీ నిర్మాణాలు పూర్తికాక లబ్ధిదారులు అయోమయంలో ఉండగా, నిర్మిస్తామన్న బీటీ రహదారి హామీ కూడా గాలిలో కలిసిపోవడంతో ఈ ప్రాంతంలో నివాసాలు ఏర్పాటుచేసుకుంటున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఉత్తుత్తి హామీలే..



రాజాంలో టిడ్కో కాలనీ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయి. ఉన్న కాస్తో కూస్తో అర్హులైన లబ్ధిదారులకు ఒక్క ఇంటిని కూడా ఇవ్వలేదు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇక్కడ 30 అడుగుల గ్రావెల్ రోడ్డు నిర్మించింది. ఈ రోడ్డును తారురోడ్డు చేస్తామని టీడీపీ కూటమి హామీ ఇచ్చింది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా పట్టించుకోకుండా వదిలేసింది. కూటమి హామీలన్నీ ఉత్తుత్తివే.

– పాలవలస శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ అధ్యక్షుడు.

ఎన్నికల స్టంటులే



చంద్రబాబువి అన్నీ ఎన్నికల స్టంటులే. గతంలో ప్రజారంజకంగా పరిపాలనచేసిన జగన్ మోహన్‌రెడ్డిపై బురదజల్లడంతో పాటు ఎన్నికల ముందు అమలుకానీ హామీలు ఇచ్చి చంద్రబాబునాయుడు అధికారం చేజిక్కించుకున్నారు. తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలను కూడా పరిష్కరించలేకపోతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఒక్కరికి కూడా ఇల్లు మంజూరు చేయలేదు. అటు టిడ్కో ఇళ్లనూ పూర్తి చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి రోడ్డు లేకుండా చేశారు.

– డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్

క్లుప్తంగా

విద్యార్థులకు దంత పరీక్షలు



విద్యార్థులకు దంతపరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజాం సిటీ: ప్రస్తుతం తరచుగా వస్తున్న సమస్యల్లో దంతసమస్యలు ఒకటని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని దంతవైద్యుడు టి.మోహన్ చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అధ్యాపకులు, 210 మంది విద్యార్థులకు మంగళవారం దంత పరీక్షలు చేశారు. దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు, అధ్యాపకుడు ఎస్.లక్ష్మణరావు, రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కనీసం ఒక్క బస్తా అయినా ఇవ్వండి



యూరియా కోసం రైతు సేవా కేంద్రం వద్ద గుమికూడిన రైతులు

సంతకవిటి: మండల రైతులను యూరియా కష్టాలు వీడడం లేదు. కట్ట యూరియా కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ప్రైవేటు ఎరువుల దుకాణాలు, రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలోని సిరిపురం గ్రామ రైతు సేవా కేంద్రంలో మంగళవారం యూరియా పంపిణీ చేపడతామని సిబ్బంది రైతులకు సమాచారం అందించారు. రైతు సేవా కేంద్రంలో 224 బస్తాల యూరియానే అందుబాటులో ఉండగా...దాదాపు 450 మందివరకు రైతులు వచ్చారు. రైతులంతా తమకు కనీసం ఒక బస్తా చొప్పున అయినా ఇవ్వాలని పట్టుబట్టడంతో చేసేది లేక అధికారులు పూర్తిగా పంపిణీని నిలిపివేశారు. దీంతో రైతులు ఉసూరుమంటూ వెనుదిరిగారు.

జేవీవీ రాష్ట్ర వ్యవసాయ కమిటీ సభ్యుడిగా గౌరీశ్వరరావు



పెంకి గౌరీశ్వరరావు

రాజాం : జన విజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర సైన్స్ ఆర్గనైజేషన్ జేవీవీ రాష్ట్ర వ్యవసాయ కమిటీ సభ్యుడిగా రాజాంకు చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు పెంకి గౌరీశ్వరరావు నియమితులయ్యారు. జిల్లా జనవిజ్ఞాన వేదిక ఈ విషయాన్ని మంగళవారం వెల్లడించింది. గౌరీశ్వరరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలు అందించి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. ఉద్యోగ విరమణ తర్వాత ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టి వంగర మండలంలోని తన స్వగ్రామం కొత్తవలసలోని పొలాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా ఉన్న సమయంలో ఆయన చేతుల మీదుగా జాతీయ రైతు నేస్తం అవార్డు అందుకున్నారు. ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

బెల్టుషాపులపై నిఘా ఉంచాలి



రికార్డులు పరిశీలిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా కమిషనర్ రామచంద్రరావు

రాజాం: గ్రామాల్లో బెల్టుషాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని, గట్టి నిఘా పెట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ విజయనగరం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు పోలీసులకు సూచించారు. రాజాంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన తనిఖీలు చేశారు. రికార్డుల నిర్వహణపై ఆరాతీశారు. బెల్టుషాపుల నివారణకు చేపట్టిన చర్యలు, పెట్టిన కేసులను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. బెల్టుషాపులకు సంబంధించి గ్రామాల్లో గట్టిగా నిఘా పెట్టాలని అన్నారు. పాత, కొత్త కేసుల్లో దొరికిన అనుమానిత వ్యక్తులను బైండోవర్ చేసి, వారిని కట్టడిచేయాలని, ప్రజా ఫిర్యాదులపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజాం ఎక్సైజ్‌శాఖ సీఐ ఆర్.జైభీమ్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బొబ్బిలిరూరల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బాలింతలు,గర్భిణులు తాము సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడంతో పాటు తమ బిడ్డల ఆరోగ్యాన్ని పరిరక్షించేవారవుతారని పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి భరద్వాజ్ అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిబ్బగుడ్డివలసలో గర్భిణులు, బాలింతలు, మహిళలకు పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండేందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

రాజాం సిటీ: మండల ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా బెవర శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా డోల వాసుదేవ రావు, గౌరవ అధ్యక్షులుగా బి.రాజేశ్వరి, ఉపాధ్యక్షులుగా కె.చంద్రినాయుడు, ఏ.సన్యాసినాయుడు, ఎస్.మధు, డి.శ్రీనివాసరావు, గేదెల గీత ఎన్నికయ్యారని ఎన్నికల పరిశీలకులు వై.సీతంనాయుడు తెలిపారు. అలాగే కార్యదర్శులుగా ఎస్.ఉమామహేశ్వరరావు, ఆర్.మురళి, వి.ఎస్.ఎస్.కాశీనాథ్, ఎం.సత్యనారాయణ, జి.ధనలక్ష్మి, జిల్లా కౌన్సిలర్‌లుగా మజ్జి మధన్, వై.భాస్కరరావు, వి.రామారావు, ఆర్.వి.జె.నాయుడు, పి.వేణుగోపాల్, కె.సూర్యకళ, కె.కృష్ణారావు, బి.అచ్యుతరావు, ఎస్.రమణ, లీల, పి.శ్రీనివాస్, వి.ఆర్.కె.నాయుడును సభ్యులు ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో ఎన్నికల పరిశీలకులు సీతం నాయుడు ప్రమాణస్వీకారం చేయించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

బొబ్బిలిరూరల్: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ అన్నారు. సీహెచ్. బొడ్డవలస రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. వరిపైరు ఎరుపు రంగులోకి మారుతోందని పలువురు రైతులు ఏడీఏ దృష్టికి తీసుకురాగా.. భూమిలో పొటాష్ లోపం వల్ల పంట రంగుమారుతోందని నివారణకు ఎకరానికి 25 కిలోల పొటాష్‌ను చల్లాలని సూచించారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి

రామభద్రపురం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పనిసరిగా ఈ–పంటలో నమోదు చేసుకోవాలని ఏడీఏ మధుసూదనరావు సూచించారు. కొట్టక్కిలో ఏఓ ఎం.శివతో కలిసి మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ–పంటపై,



రామభద్రపురం: కొట్టక్కిలో వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ మధుసూదనరావు,ఏఓ శివ

వరి,పత్తి, తదితర పంటల సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈ–పంట నమోదు చేసుకోవడం వల్ల పంటల విక్రయంతో పాటు పంటల మద్దతు ధర, పంటల బీమా,వడ్డీ లేని రుణాలు ,తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. వరి పంటలో రెండో దఫా నానో యూరియా వాడాలని సూచించారు. రైతు సేవాకేంద్రం సిబ్బంది జి.సౌజన్యపాల్గొన్నారు.

ఖండ్యాంలో ఆయుర్వేద దినోత్సవం

రేగిడి: జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఖండ్యాం గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ధన్వంతరి చిత్రపటం వద్ద గ్రామస్తులతో కలిసి పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగాలను ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఆయుర్వేద మందులతో నయం చేయవచ్చన్నారు. కీళ్లనొప్పులు, మూలవ్యాధి, శ్వాసకోశ, తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వాటికి ఆయుర్వేద మందులు అందజేశారు. గొలివి జగ్గునాయుడు, బూసి



ధన్వంతరి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న వైద్య సిబ్బంది,గ్రామస్తులు

ప్రసాద్, గొలివి హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పోలినాయుడు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే బలమైన సమాజం



అర్బన్ పీహెచ్‌సీకి వైద్యసేవలకు వచ్చిన మహిళలకు రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: ఆరోగ్యవంతమైన మహిళలతోనే బలమైన సమాజం నిర్మించవచ్చు అని స్థానిక ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారులు యు.కిరణ్‌కుమార్, గుడివాడ స్వర్ణలత అన్నారు. స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా అర్బన్ పీహెచ్‌సీలో మంగళవారం మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 139 మంది మహిళలకు వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మహిళలకు కంటి పరీక్షలు చేసి తొమ్మిది మందిని శస్త్రచికిత్సలకు రిఫర్ చేశారు.రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఆయుష్ వైద్యాధికారి టి.సుజాత, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



బొమ్మినాయుడువలసలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు సిద్ధీశ్వరి, చరణ్

రాజాం: ఆరోగ్యమే మహా భాగ్యమని, మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని బొద్దాం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికా రులు సిద్ధీశ్వరి, చరణ్ అన్నారు. మంగళవారం బొద్దాం, ఎం.జె.వలస, బొమ్మినాయుడువలస గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. పలువురుకి ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. సమగ్ర ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆస్పత్రి సిబ్బంది, స్థానిక ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యదర్శులు, సూపర్ వైజర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక ధరలకు అవసరం లేని ఎరువులు..!

- యూరియా కొరతతో రైతన్నల అవస్థలు
- కాంప్లెక్స్ ఎరువులను వాడాలని వ్యవసాయ అధికారుల ఉచిత సలహా

బొబ్బిలి: యూరియా,డీఏపీ కోసం రైతన్నలు అల్లాడిపోతుంటే కూటమి ప్రభుత్వం అవసరం లేని,రైతులు వినియోగించని ఎరువులను ప్రైవేటు దుకాణాల్లో ఉంచుతోంది.నియోజకవర్గంలో కేవలం సెప్టెంబర్ నెలకే 5,618 టన్నుల యూరియా అవసరం. సెప్టెంబర్ నెల గడిచిపోతుండగా ఇంకా 600 టన్నుల యూరియా కొరత ఉంది. రైతులు అడుగుతున్న యూరియా పంపిణీ చేయకుండా పొటాష్, 20–0–13, 28–28–0,14–35–14,వంటి కాంప్లెక్స్ ఎరువులను వినియోగించాలని వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు ఇస్తున్నారు. అధికారుల ఉచిత సలహాలపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మాకు అవసరమైన యూరియాను ఇస్తే చాలని, తామేమీ పంటలకు మోతాదుకు మించి యూరియా వేయడం లేదని రైతులు అంటున్నారు. దశాబ్దాల తరబడి వ్యవసాయం చేస్తున్న తమకు పంటలకు ఎంత



బొబ్బిలి ఏఎంసీ మార్కెట్ గోదాంలో కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు

యూరియా వేయాలో తెలియదా ?, తగిన మోతాదులోనే వినియోగిస్తున్నామని రైతులు చెబుతున్నారు. ప్రైవేటు దుకాణాల్లో యూరియా అడిగితే కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని దుకాణదారులు అంటున్నారని, అవసరంలేక పోయినా యూరియా కోసం కాంప్లెక్స్ ఎరువులను అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని, అధికారులకు ఈ విషయం చెబుతున్నా పట్టించుకోవడం లేదని నియోజకవర్గంలోని రైతులు వాపోతున్నారు. రూ.270కు లభించే యూరియాను కాకుండా రూ.1400 నుంచి రూ.1,800 వెచ్చించి కాంప్లెక్స్ ఎరువులు వాడమనడం సరికాదని అంటున్నారు. అరకొరగా యూరియా సరఫరా చేసి తమను ఇబ్బందుల పాల్జేస్తున్నారని బొబ్బిలి,బాడంగి, రామభద్రపురం,తెర్లాం మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదును దాటిపోయినా తర్వాత యూరియా ఇస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తీరు వల్ల వరి పంట దిగుబడులు తగ్గిపోయే ప్రమాదముందని రైతులు అంటున్నారు.

వంద టన్నులు వచ్చింది



బొబ్బిలి నియోజకవర్గంలోని రేజేరు, వీరసాగరం,కోడూరు–1, నెమలాం, పూనువలస, వెలగవలస, పెరుమాళి,కూనాయవలస రైతు సేవా కేంద్రాలకు వంద టన్నుల యూరియా వచ్చింది. మంగళవారం కొంత పంపిణీ చేశాం. బుధవారం కూడా పంపిణీ చేస్తాం.ఇప్పటి వరకు 5,258 టన్నుల యూరియా పంపిణీ చేశాం.

– ఎం మధుసూదనరావు, ఏడీ, వ్యవసాయ శాఖ, బొబ్బిలి డివిజన్

ఈపీఎఫ్ పింఛన్ రూ. 9వేలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: ఈపీఎఫ్ కనీస పింఛన్ రూ. 9వేలు డీఏతో కలిపి అమలు చేయాలని కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని రాజయ్యపేటలో ఈపీఎఫ్ పింఛన్‌దారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014కు ముందు ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే పింఛన్ రూ. 6వేలు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీకి 11 ఏళ్లుగడుస్తున్నాయని అన్నారు. అయినా ఇంత వరకు దాని ఊసెత్తక ఎన్‌డీఏ ప్రభుత్వం ఈపీఎఫ్ పింఛన్ దారులకు మొండిచేయి చూపుతుందని విమర్శించారు. ఇప్పటికీ వస్తున్న రూ. వెయ్యి పింఛన్‌తో ఎలా బ్రతికేదని అన్నారు. వృద్ధాప్యంలో పింఛన్ ఒక భరోసా అని, కనీస పింఛన్ రూ. 9వేలు డీఏతో కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు.యూనియన్ నాయకులు ఆనెం సత్యారావు, కొనపల రామ్మూర్తి, కోడి చిరంజీవి, కర్రి లలిత, గంట విజయ్, సిక్కాల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ నవీకరణ చేసుకోవాలి



రామభద్రపురం సచివాలయం-2లో ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సన్యాసిరావు

రామభద్రపురం: ఆధార్ కార్డుకు సంబంధించి బయోమెట్రిక్ పెండింగ్‌లో ఉన్న వారంతా సచివాలయాల్లోని ఆధార్ ప్రత్యేక శిబిరాలకు వెళ్లి బయోమెట్రిక్‌ను నవీకరణ చేసుకోవాలని ఎంపీడీఓ సీహెచ్.సన్యాసిరావు సూచించారు. మండల కేంద్రంలోని సచివాలయం–2లో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రామభద్రపురం సచివాలయం–2 కొట్టక్కి, గొల్లపేట, రొంపల్లి, ఆరికతోట, కోటశిర్లాం, పాతరేగ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరాలు ఈ నెల 26వ తేదీ వరకు నడుస్తాయని, వీటి సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. 5 నుంచి 15ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పిల్ల లు తమ బయోమెట్రిక్ నవీకరణ పూర్తి చేసుకోవాలన్నారు.అలాగే 15 ఏళ్ల పైబడిన పిల్ల లకు సంబంధించి పెండింగ్ ఉన్న వారు కూడా బయోమెట్రిక్ నవీకరణ పూర్తి చేసుకోవాలని చెప్పారు.

తెలుగు భాషోపాధ్యాయుల పోస్టుల తొలగింపు దారుణం



నినాదాలు చేస్తున్న భాషోపాధ్యాయులు

రాజాం సిటీ: నానాటికి మనుగడ కోల్పోతున్న తెలుగుభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్రభాషోపాధ్యాయ సంఘం సీనియర్ నాయకుడు వి.గౌరీకుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం తెలుగు భాషోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు భాషోపాధ్యాయుల పోస్టులను ప్రభుత్వం తొలగించడం దారుణమన్నారు. ఇది ముమ్మాటికీ తెలుగు భాషపట్ల వివక్ష చూపడమేనని పేర్కొన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రతీ పాఠశాలలో మాతృభాషలోనే బోధన జరగాలని నినాదాలు చేశారు. భాషోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి లెంక శ్రీనివాసరావు, సభ్యులు ముదిలి శంకరరావు, చల్లా త్రిమూర్తినాయుడు, ఓ.సుభాషిణి, సురేష్, నళిని, వి.వి.గణపతిరావు, బలరామ్మూర్తి , ఈసర్ల మురళీకృష్ణ, వై.అప్పలనాయుడు పాల్గొన్నారు.

గాయత్రీ మాతా నమో నమః

శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో, ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన మంటపాల్లో అమ్మవార్లకు రెండో రోజు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం: రాజాంలోని గాయత్రీదేవి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



బొబ్బిలి: పాత బొబ్బిలిలోని కూరాకుల వీధిలో ఏర్పాటు చేసిన మంటపంలో పూజలు చేస్తున్న మహిళలు



బొబ్బిలిరూరల్: కృష్ణాపురంలోని దుర్గాదేవి ఆలయంలో గాయత్రీమాతగా దర్శనమిస్తున్న అమ్మవారు



తెర్లాం: పణుకువలసలోని కనకదుర్గ ఆలయంలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



రాజాం సిటీ: డోలపేటలో దుర్గాదేవి ఆలయం వద్ద భజన చేస్తున్న భవానీ భక్తులు



రేగిడి: రేగిడిలోని దుర్గామాత ఆలయం వద్ద పూజలు చేస్తున్న భవానీ భక్తులు



బాడంగి: గజరాయునివలసలో పూజలుచేస్తున్న భవానీ భక్తులు

నేడు పొదుపు ఉద్యమ ర్యాలీ

బొబ్బిలి: తపాలా శాఖ ఆధ్వర్యంలో పొదుపు ఖాతాల నిర్వహణ, ఇతర పొదుపు పథకాలపై ప్రజలను చైతన్య పరుస్తూ బుధవారం అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించనున్నట్టు బొబ్బిలి సబ్ డివిజినల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు బొబ్బిలి పట్టణంలో ర్యాలీ ప్రారంభమవుతుందని, అనంతరం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. తపాలా పొదుపు పథకాలు,ఖాతాలపై ఆసక్తి ఉన్న వారంతా పాల్గొనాల్సిందిగా కోరారు.

సామూహిక సీమంతం



తెర్లాం:గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు

తెర్లాం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నందబలగ గ్రామ సచివాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు అంగన్‌వాడీ కార్యకర్త లు మంగళవారం సీమంతం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ మాట్లాడు తూ గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. నందబలగ, జనార్దనవలస, కుసుమూరు, కె.కుసుమూరు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. గేదెల శశిభూషణరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.దమయంతి,అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: పట్టణంలోని సీహెచ్‌సీలో బొబ్బిలి ఐసీడీఎస్ పీఓ జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరాన్ని, బిడ్డకు తల్లిపాలు అందించాల్సిన ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలకు పీఓ విజయలక్ష్మి అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు,సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి